క్లుప్తంగా

వెంచర్ నిర్వాహకులకు నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

తుక్కుగూడ: రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వెంచర్ రోడ్డు నుంచి భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో వెంచర్ నిర్వాహకులు రోడ్డు ప్రధాన గేటుకు తాళం వేశారు. దీంతో 'ఎల్లమ్మ భక్తులకు ఇక్కట్లు' అనే శీర్షికన ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు గురువారం స్పందించారు. వెంచర్ నిర్వాహకులకు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి నోటీసులు జారీ చేశారు. భక్తుల వినియోగం రోడ్డు గేటు తెరవాలని నోటీసులో ఆదేశించినట్లు సమాచారం.

విద్యార్థులకు క్రీడా పరికరాల అందజేత



విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న దాతలు

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు దాతలు సహకరించడం సంతోషంగా ఉందని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం లయన్ కందుకూరు కోశాధికారి వేంకటేశ్వర్లుగుప్తా, సోదరుడు కె.సత్యనారాయణలు వారి తండ్రి జనార్దన్‌గుప్తా జ్ఞాపకార్థం మండలంలోని నేదునూరు పరిధి మోడల్ స్కూల్ విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. అనంతరం దాతలను ప్రిన్సిపాల్ విష్ణుప్రియ అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయండి


కమిషనర్ వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఠల్

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ వారి జాతర ఉత్సవాలకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆలయ ధర్మకర్త కరణ్‌కోట్ విఠల్ బాబా కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విఠల్ మాట్లాడుతూ.. ప్రాచీన ఆలయంలో ఫిబ్రవరి 8,9,10 తేదీల్లో జరిగే ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు. ఉత్సవాల నిర్వహణకు రూ.3 లక్షలు కేటాయించామని కమిషనర్ తెలిపారు.

ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్

బడంగ్‌పేట్: పదేళ్లు అధికారంలో ఉండి, పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వని బీఆర్‌ఎస్ నాయకులు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం, రుణమాఫీ చేస్తామని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మాయమాటలతో మభ్యపెట్టారని విమర్శించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలు ఆ పార్టీ నేతల మాటలు నమ్మి మోస పోవద్దని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు.

సంతృప్తినిచ్చిన ఐదేళ్ల పాలన


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: గడిచిన ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యే సబితారెడ్డి కృషి, సహకారంతో జరిగిన అభివృద్ధి పనులు, పాలన సత్సృప్తినిచ్చిందని పాలక మండలి సభ్యులు అన్నారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ పాలక మండలి చివరి కౌన్సిల్ సమావేశం చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన, కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫండ్ రూ.4.5 కోట్ల నిధులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ పైప్ లైన్లు వేసేందుకు ఒక్కో వార్డుకు రూ.15 లక్షలు కేటాయించారు. జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ ఆలయ జాతర ఉత్సవాల నిర్వహణకు మరో రూ.3 లక్షలు వెచ్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. 2020 జనవరి 27న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అందరినీ కలుపుకొని మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


తుక్కుగూడ: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


కందుకూరు: సరస్వతిగూడ గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు


పహాడీషరీఫ్: మామిడిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, కార్పొరేటర్లు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజలు ఆందోళన చెందొద్దు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- పారదర్శకంగా జాబితా
- గ్రామసభలో ప్రజాప్రతినిధులు, అధికారులు

బడంగ్‌పేట్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మేయర్ పారిజాత అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నేపథ్యంలో గురువారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి 6,7,8,9,10,19, 27,31 డివిజన్లలో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాబితాలో పేరు రాలేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. మరోసారి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ అర్జీ చేసుకోని వారు ఉంటే.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో స్పెషల్ హెల్ప్‌డెస్క్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామని, అందులో అర్జీ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని కౌన్సిలర్లు సప్పిడి లావణ్య, బాదావత్ రవినాయక్‌లు కోరారు. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రం 10,13వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు ప్రజల నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించారు.

కందుకూరులో..

కందుకూరు: ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని డీపీఓ సురేష్ మోహన్ అన్నారు. సరస్వతిగూడలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత నాలుగు పథకాల్లో అర్హులై ఉండి జాబితాలో పేర్లు రానివారు ఉంటే.. మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కందుకూరు, కొత్తగూడలో ఎంపీడీఓ సరిత, సర్వతిగూడ, అగర్‌మియాగూడలో తహసీల్దార్ గోపాల్, దాసర్లపల్లి, దాసర్లపల్లితండాలో ఎంపీఓ గీత, తిమ్మా పూర్, మాదాపూర్‌లో ఏఈ సతీష్‌రెడ్డి, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడల్లో ఏఈ శారద, నేదునూరులో ఏఓ లావణ్య ఆధ్వర్యంలో గ్రామ సభలు కొనసాగాయి. అర్హుల జాబితాను ప్రదర్శించారు. కొత్తగా దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బడంగ్‌పేట్: దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ పారిజాత, కమిషనర్ సరస్వతి

3145 దరఖాస్తులు

మూడు రోజులుగా మండలంలో నిర్వహించిన గ్రామ సభల్లో 3145 దరఖాస్తులను స్వీకరించామని ఎంపీడీఓ సరిత తెలిపారు. రేషన్ కార్డులకు 2088, ఇందిరమ్మ ఇళ్లకు 712, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 304, రైతుభరోసాకు 41 మంది అర్జీ పెట్టుకున్నారని పేర్కొన్నారు.

సాగు భూములకే భరోసా

మహేశ్వరం: సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా పథకం వర్తించదని తహసీల్దార్ సైదులు అన్నారు. పెండ్యాల గ్రామంలో మూడో రోజు నిర్వహించిన సభలో కొత్త పథకాల అర్హుల జాబితాను ప్రదర్శించి ఆయన మాట్లాడారు. సాగు భూములకే సాయం అందుతుందని తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని వారు ఆందోళన చెందవద్దని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు పెండ్యాల, ఉప్పుగడ్డతండా, ఎన్టీతండా, పోరండ్ల, రామచంద్రగూడ, సిరిగిరిపురం, సుభాన్‌పూర్, చిన్న తూప్ర,పెద్దమ్మతండాలో సభలు నిర్వహించారు.

28న మందకృష్ణ మాదిగ రాక

మహేశ్వరం: వెయ్యి గొంతులు– లక్ష డప్పుల సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నారని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్ చౌరస్తాలో సభ వాల్ పోస్టర్‌ను సమితి నాయకులు, దళిత నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా.. కొంత మంది స్వార్థపరులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సభ నేపథ్యంలో ఈ నెల 28న మహేశ్వరం మండల కేంద్రంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి మంద కృష్ణ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాదిగ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగయ్య, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రఘుపతి, మాజీ సర్పంచ్ ఆనందం తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

ప్రమాదాల నివారణకు చర్యలు

ట్రాఫిక్ సీఐ వెంకటేశం

చేవెళ్ల: వాహన ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నట్లు చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం అన్నారు. గురువారం మండలంలోని పలు రోడ్లపై ఉన్న మలుపులు, యూటర్న్‌ల వద్ద వేగ నియంత్రణ కోసం ట్రాఫిక్ బొలార్డ్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారుల వేగ నియంత్రణ చేసి ప్రమాదాలు జరగకుండా ఈ బొలార్డ్స్ పనిచేస్తాయని చెప్పారు. వీటిని మండలంలోని జాతీయ రహదారి మూడిమ్యాల నుంచి చిట్టెంపల్లి వరకు ఉన్న హైవే రోడ్డు పరిధిలో ప్రమాదాల జరిగే చోట ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎన్కేపల్లి చౌరస్తాలో బొలార్డ్స్‌ను ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మంచాల: ఇళ్ల స్థలాలు లేక, సొంతింటి కలకు నోచుకోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆగాపల్లి గ్రామస్తులు కోరారు. గురువారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎంపీడీఓ బాలశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో సర్వే నంబర్ 128లో 7.26 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేని పేదలను గుర్తించి 60 గజాల చొప్పున అర్హులకు భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, నాయకులు శేఖర్‌గౌడ్, రవి, దేవయ్య, యాదయ్య పాల్గొన్నారు.

ఆ ప్లాట్లకు రైతుభరోసా ఇవ్వొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: మూడు దశాబ్దాల క్రితం ప్లాట్లుగా చేసి, విక్రయించిన భూములకు రైతు భరోసా ఇవ్వకూడదని, ఇప్పటి వరకు అక్రమంగా రైతుబంధును తీసుకున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని గండిచెరువు వాసి జక్క పాపిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గండిచెరువు గ్రామం సర్వే నంబర్ 188నుంచి 192,195 పార్ట్, 196,197,201,202ల లోని సుమారు 120 ఎకరాల భూమిని 1992,1993 సంవత్సరంలో లక్ష్మీప్రియా నగర్, శివప్రియానగర్ కాలనీల పేరుతో లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయించారని పేర్కొన్నారు. అలా కొనుగోలు చేసిన ప్లాట్లలో అనుమతుల తీసుకుని పలువురు నిర్మాణాలు చేపట్టారని, అయినప్పటికీ గతంలో ఆ భూములకు రైతుబంధు ఇచ్చారని తెలిపారు. మరలా రైతు భరోసా ఇవ్వనున్నట్లు జాబితాలో పేరు ఉందని వెల్లడించారు. రైతుభరోసా ఇవ్వకుండా నిలిపివేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశానని పాపిరెడ్డి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని తంగళ్లపల్లిలో లో ఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌గౌడ్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌కో అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గోవర్ధన్‌గౌడ్, గ్రామస్తులు నారాయణచారి, రామకృష్ణ, శివకృష్ణ, రమేష్, జంగయ్య, వెంకటయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఆమనగల్లు: ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, రైతులందరికీ రైతుభరోసా అందించాలని, అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్లు ఉన్నవారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు మంజూరు చేశారని ఆరోపించారు. ఇదే విషయమై ప్రజలు గ్రామ సభల్లో అధికారులను నిలదీస్తున్నారని, వారు సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయిలు, రఘు, వెంకటేశ్, భాస్కర్, శివకుమార్, యాదయ్య, జగన్, సైదులు, గణేశ్, మహేశ్ నేత తదితరులు ఉన్నారు.

పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ నేడు

మహేశ్వరం: మండల పరిధి డబీల్‌గూడ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయ 11 గంటలకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని సంఘం గ్రామ అధ్యక్షుడు, విగ్రహ దాత అల్వాల చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ గౌడ్‌లు గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ తదితరులు రానున్నారని పేర్కొన్నారు.

నేడు పాలకమండలి సభ్యులకు సన్మానం

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ కౌన్సిలర్ల (పాలకమండలి సభ్యులు) పదవీ కాలం పూర్తి కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్ఎన్ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు సన్మాన సభను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఏ.వాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిల్ సభ్యులందరూ రావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విజయపురి ఫీడర్ పరిధి కాలనీల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, 11కేవీ ఆర్‌కేపురం, అష్టలక్ష్మి, అల్కాపురి సౌత్‌ఎండ్ పార్కు ఫీడర్ల పరిధి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధి మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు– టీకేఆర్ కళాశాల రోడ్డు, శక్తినగర్, అంబేద్కర్‌నగర్, న్యూ గాయత్రి నగర్, ఓల్డ్ గాయత్రినగర్ కాలనీ, డీఆర్‌ఆర్ హోమ్స్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, 11కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధి లలితానగర్, విజయా హోమ్స్, వెంకటాద్రినగర్, రాఘవేంద్రనగర్, వాంబేకాలనీ, ఆదిత్యనగర్, వీరమణికాలనీ, జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

సేవలతోనే సమాజంలో గుర్తింపు


అవార్డు అందుకుంటున్న మహేశ్

కడ్తాల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు కార్యదర్శి దోనాదుల మహేశ్ అన్నారు. లియోక్లబ్, లయన్స్ క్లబ్‌తో పాటు, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు, అనేక సామాజిక అంశాలపై అవగాహన సదస్సులు మహేశ్ నిర్వహించారు. అతని సేవలను గుర్తించిన తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ నిర్వాహకులు.. 'యూత్ అండ్ నేషనల్ యునిటీ అవార్డు–2025'కు ఎంపిక చేశారు. ఈ మేరకు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమలో సిటీజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజ్‌నారాయణ్, హైకోర్టు రిటైర్డ్ జడ్జీ పీఎస్ నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగారంలు మహేశ్‌కు అవార్డు అందజేశారు.

కార్మికులను క్రమబద్ధీకరించాలి

సీఐటీయూ నాయకుల డిమాండ్

తుర్కయంజాల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, స్వచ్ఛ ఆటో కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కమిషనర్ అమరేందర్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు సరిపడా కార్మికులు లేకపోవడంతో గడిచిన రెండేళ్లుగా హరితహారం, ప్రైవేటు కాంట్రాక్టు పేరుతో సుమారు 50 మంది కార్మికులతో పలు రకాల పనుల చేయిస్తున్నారని పేర్కొన్నారు. వేతనాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదని ఆరోపించారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేలా కౌన్సిల్ తీర్మానం చేయించాలని కమిషనర్‌ను కోరారు. చెత్త సేకరించే వారికి ఒక్కో ఇంటికి రూ.150 చొప్పున ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, నాయకులు సత్యనారాయణ, యాదగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విగ్రహప్రతిష్ఠాపనకు ఆహ్వానం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంఠమహేశ్వర దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 30,31 తేదీలలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. కార్యక్రమంలో పాల్గొనాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని ఆహ్వానిస్తూ.. గురువారం గౌడసంఘం నాయకులు అల్లాజీగౌడ్, గంగా రవీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్‌లు ఆహ్వాన పత్రిక అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కౌన్సిలర్లు విక్రంరెడ్డి, లక్ష్మణ్, సంఘం నాయకులు నారాయణగౌడ్, యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఆచారికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గౌడసంఘం నాయకులు

పశుపోషకులకు 'హామీ' వరం

- ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో కొట్టాల నిర్మాణం
- జాబ్‌కార్డు దారులు, మహిళా సంఘాల సభ్యులకు అవకాశం

షాబాద్: పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదే విధంగా పశువులు, జీవాల పోషణకు పచ్చగడ్డి పెంపకం, నీటితొట్ల నిర్మాణాలకు ఆర్థికంగా చేయూత అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారితో పాటు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులను అర్హులుగా గుర్తిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు గొల్ల కురుమలకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

యూనిట్ విలువ ఇలా..

పశువుల కొట్టాల నిర్మాణానికి రూ.58 వేల చొప్పున మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. అదే విధంగా మహిళాశక్తి ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, జలసంబాయ్, జలభగీరథ, రూరల్ శానిటేషన్ కింద వివిధ యూనిట్లను నిధులను మంజూరు చేసేలా కార్యాచరణ రూపొందించారు. వేసవిలో జీవాల దాహం తీర్చించేందుకు గాను నీటితొట్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. జీవాల సంఖ్య ఆధారంగా నీటితొట్ల నిర్మాణానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

దరఖాస్తు విధానం

పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారి నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకం దారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొంది మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులను మంజూరు చేస్తారు. షాబాద్ మండలానికి 10 యూనిట్లు మంజూరు చేశారు. ఇందులో పశువుల కొట్టాల నిర్మాణానికి 17 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 10 నిర్మాణంలో ఉన్నాయి. మిగతావి పనులు ప్రారంభించ లేదు.


పశువుల కొట్టానికి నిర్మాణం

సద్వినియోగం చేసుకోవాలి



పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కొట్టాలు, షెడ్ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధిహామీ జాబ్‌కార్డు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పథకం వర్తిస్తుంది. వందశాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణం చేపడుతారు.

– వీరాసింగ్, ఏపీఓ, షాబాద్

క్షేత్రస్థాయిలో అవగాహన



మండలంలోని అన్ని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. పశువుల కొట్టాలు, షెడ్ల మంజూరులో గొల్ల కురుమలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. గ్రామస్థాయిలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు మంజూరు చేస్తారు.

– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్